

అగ్రహారం నడిబొడ్డు నున్న ఆ పాత కాలం నాటి పెంకుటింట్లో చావు కళ చూరుల్ని పట్టుకు వేలాడుతోంది

ఆ ఇంటి నాలుగు గోడల మధ్య భయంకరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది

ఆ ఇంటి కిటికీలోంచి బయటకు చూస్తే అంతా చీకటిగా ఉంది వీధి లైట్లు చాలాసేపై •ఆరిపోయాయి చల్లగాలి రివ్వున వీస్తోంది ఉండుండి మెరుపులు తళుక్కుమంటున్నాయి నల్లని ఆకాశం వర్షించడానికి ఉవ్విళ్ళూరుతోంది

ఆ ఇంటి వీది గదిలో వాలు కుర్చీలో జారబడి కూర్చున్న సీతారామయ్యగారు మౌనంగా కిటికీలోంచి బయటకు చూస్తున్నారు

ఆయన మనసు నిండా నిరాశ, నిస్తేజం, నిర్లిప్తత

ఆయనలో ఒంటరితనం ఎడారిలా

ఏ స్పందనలు లేవు

ఏ కోరికలు లేవు

వృద్ధాప్యం పులిలా మీద పడి ఒంటరిగా బారంగా చావు కోసం ఎదురు చూస్తూ రోజుల్ని వెళ్ళదీస్తున్నారు

మనసుకు శాంతిలేదు

బ్రతుకు మీద ఆశ లేదు

ఎందుకీ జీవితం? ఎవరి కోసం? ఒంటరిగా వృద్ధాప్యపు నిశీధి నీడల మాటున నా అనే దిక్కులేక ఏ సంతోషాన్నీ, ఏ ఆనందాన్నీ చవిచూడక ఎంతకాలం ఇలా మోడులా బ్రతకడం? అన్న ప్రశ్నలు పదే పదే గుర్తొచ్చి ఆయన అంతరంగాన్ని ఆవేదనతో కుదిపివేస్తున్నాయి బ్రతుకు మీద చెప్పలేని రోతను, వైరాగ్యాన్ని పుట్టిస్తున్నాయి

మొన్న మొన్నటి వరకూ కొంత ధైర్యంగానే బ్రతకారాయన తాను, తన భార్య కన్నకొడుకుల ఆదరణకు నోచుకోక పోయినా ఒకరికొకరు తోడుగా బ్రతుకుతున్నామన్న తృప్తి అయినా ఉండేది

ఇప్పుడు అది కూడా లేదు

నెల రోజుల క్రితం మృత్యువు పిలుపందుకొని ఆయన భార్య కామాక్షమ్మ ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయింది వెళుతూ వెళుతూ ఆయనకు గుండెలు కాల్చే ఒంటరితనం మిగిల్చింది ఆయన కన్నీళ్ళలో తన జ్ఞాపకాలు కుమ్మరించింది

అయిపోయింది భార్య పోవడంతో సీతారామయ్యగారి జీవితంలో వెలుగు ఆరిపోయింది ఆయన బ్రతుక్కి ఆలంబనగా ఉన్న ఒక్క తోడు ఒరిగిపోయింది

భార్య కన్ను మూసేక కొడుకులిద్దరికీ కబురంపారాయన తల్లి మరణవార్త విని ఇద్దరు కొడుకులు పరిగెత్తుకొంటూ వచ్చారు తల్లి అంత్యక్రియలన్నీ దగ్గరుండి జరిపారు

నెల రోజులు గడిచాయి

కార్యక్రమాలన్నీ ముగిసాయి

వచ్చిన కొడుకులు వచ్చినట్లే వెళ్ళిపోయారు

కొడుకుల ప్రవర్తనకు సీతారామయ్య గారి గుండెల్లో సన్నగా మంట రేగింది

బార్య పోయి దుఃఖంలో ఉన్న తనను ఓదార్చి 'నాన్నా ఈ ఒంటరి బ్రతుకు నీకెందుకు? మేమంతా లేమా? మాతో పాటు వచ్చి ఉండు మా కలలు, ఆశలు, భావాలు నువ్వూ పంచుకో' అంటూ తనను చేరదీయవలసిన కొడుకులు, ఒంటరిగా మగ్గిపో' అని శపిస్తున్నట్లు ఎవరి దారిన వారు వెళ్ళిపోవడంతో ఆయన మనసు రంపపు కోతకు గురైంది

"చీ చీ" ఏం మనుషులో ఏం బ్రతుకులో వీళ్ళలో మార్పు వస్తుందనుకోవడం తన అవివేకం" అనుకున్నారాయన గుండె నిండిన ఆవేదనతో అలా అనుకొంటున్నప్పుడు ఆయన కళ్ళలో సన్నటి కన్నీటి పొర కదలాడింది ఆయన ఆలోచనల్లో ఒకనాటి చేదు గతం నిలిచింది

★ ★ ★ ★ ★

అవి సీతారామయ్యగారు ఉద్యోగం నుండి కొత్తగా రిటైరైన రోజులు ముందుగా బార్యతో పాటు విశాఖపట్నంలో ఉంటున్న పెద్దకొడుకు రఘురాం దగ్గరకు బయలుదేరి వెళ్ళారు వెళ్ళి వారం రోజులైనా అతడి ఇంట్లో గడపలేదు తృప్తిగా

ఓ రోజు రఘురాం ఆయన దగ్గరకు వచ్చేడు

"నన్ను క్షమించండి నాన్నా మిమ్మల్ని నా దగ్గర ఉంచుకోలేను ఇలా అంటున్నానని మీరు మరోలా భావించకండి దూరం నుండి మీ కంటికి నేను పచ్చగా బ్రతుకుతున్నట్లు కన్పించవచ్చు కానీ నా సమస్యలు నాకున్నాయి కన్న ఇద్దరు పిల్లల్నీ పెంచలేకనే నానా కష్టాలు పడుతున్నాను ఇక మిమ్మల్ని పోషించడమంటే నా తరం కాదు అందుకె సిగ్గు విడిచి చెప్తున్నాను ఇక్కడికన్నా తమ్ముడి వగ్గరైతే మీకు హాయిగా ఉంటుంది వాడికింకా పిల్లాజెల్లా లేరు మిమ్మల్ని పోషించడం వాడికి పెద్ద కష్టం కాదు అలా అని పూర్తిగా వాడి మీదే మిమ్మల్ని వదిలేయను నేను కూడా నెలకు ఎంతో కొంత డబ్బు వాడికి పంపిస్తాను" అన్నాడు

ఇంతలో ఏ పక్కనుండి వచ్చిందో కోడలు జయ–

"అవును మామయ్యగారూ మా పరిస్థితిని కాస్త అర్థం చేసుకోండి నిజానికి ఈ ముసలి

కాలంలో మిమ్మల్ని మేము కంటికి రెప్పలా కాపాడుకోవాలి. కానీ ఏం చేస్తాం? మాకు ఆ శక్తిని భగవంతుడు ఇవ్వలేదు". అంది.

కొడుకు, కోడలు అన్న మాటలకు సీతారామయ్యగారు కాసేపు తేరుకోలేక పోయారు. అలాంటి పరిస్థితిని ఆయన కలలో కూడా ఊహించలేదు.

తనకు ఇద్దరు కొడుకులని, రిటైర్ అయ్యాక ఏ కొడుకు దగ్గరకు వెళ్ళినా తన జీవితం, తన భార్య జీవితం ఆనందంగా గడిచిపోతుందని ఆశించారు ఆయన. కానీ ఆ ఆశ అడియాస అవుతుంటే ఆ నిజాన్ని జీర్ణించుకోలేక మెల్లగా తల తిప్పి పక్కనున్న భార్య ముఖంలోకి చూసారు.

"పోనీలెద్దురూ వాడు అన్నట్టు హాయిగా చిన్నవాడి దగ్గరకే వెళ్ళిపోదాం ఏ కొడుకు దగ్గరున్నా మనకు ఒక్కటే కదా....." అంది కామాక్షమ్మ భర్త ముఖంలోకి చూస్తూ అమాయకంగా.

భార్యను ఆ స్థితిలో చూస్తుంటే సీతారామయ్యగారి గుండె తరుక్కుపోయింది. ఆమె మనస్ఫూర్తిగా ఆ మాటలు అనలేదని ఆయనకు తెలుసు.

ఆ మర్నాడే భార్యను తీసుకొని హైదరాబాద్‌లో వున్న చిన్నకొడుకు సురేష్ దగ్గరకు బయలుదేరారు సీతారామయ్యగారు. అక్కడికి బయలుదేరుతున్న మాటేగాని అతడేం అంటాడోనని ఆయన మనస్సు ఒక ప్రక్క పీకుతూనే ఉంది. ఆయన అనుకున్నట్టు అతడి గడప ఎక్కి నాలుగు రోజులైనా గడవకముందే చావు కబురు చల్లగా చెప్పాడు. "చూడండి నాన్నా.... ఈ మహానగరంలో ఇద్దరు వ్యక్తుల్ని పోషించడం అంటే సామాన్యం కాదు. నాకు ఆ స్తోమత లేదు. అన్నయ్య నెలకు ఏలాగూ కొంత డబ్బు పంపిస్తానన్నాడు. నేను కూడా కొంత పంపిస్తాను. మన స్వంత వూరు సొంత ఇల్లు ఉండనే ఉన్నాయి. అక్కడ అందరూ మీకు తెలిసిన మనుషులే. హాయిగా కృష్ణా... రామా అనుకుంటూ ఇద్దరూ కలిసి ప్రశాంతంగా అక్కడే ఉండండి" అన్నాడు.

చిన్నకొడుకు కూడా అలా అనేసరికి సీతారామయ్యగారి గుండెల్లో అగ్నిపర్వతం నిశ్శబ్దంగా బద్దలైంది. మెల్లగా అలజడి మొదలైంది. నిగ్రహించుకోవడానికి విశ్వప్రయత్నం చేయసాగేరు.

కామాక్షమ్మ మాత్రం తనను తాను నిగ్రహించుకోలేకపోయింది. నవమాసాలు మోసి కని, పెంచిన ఆ మాతృహృదయం ఒక్కసారి భగ్గుమంది.

"ఉంటాం నాయనా ఉంటాం... ఆ మాత్రం మాకు తెలియక కాదు... అన్ని మైళ్ళు దాటుకుంటూ నిన్ను వెతుక్కుని వచ్చింది... కన్నందుకు మంచి ప్రతిఫలమే దక్కించావు" గద్గద స్వరంతో పౌరుషంగా అందావిడ.

"ఏం మీరు ఈయన ఒక్కరినే కన్నారా? మీ కష్టాన్నంతా ఈయన ఒక్కరికే ధారపోసినట్టు మాట్లాడుతారేం?" అక్కడే ఉన్న కోడలు సుధ నోటి వెంట మాటలు విసురుగా వచ్చేయి.

"కన్నానమ్మా... ఇద్దరు బిడ్డల్ని కన్నాను. రత్నాల్లాంటి బిడ్డలు. కానీ ఏం లాభం. మా వరకూ వచ్చేసరికి ఎందుకూ పనికిరాలేదు" దుఃఖంతో కామాక్షమ్మ గారి గొంతు జీరబోయింది.

"ఎందుకమ్మా... నోరు పారేసుకుంటావు? మా ఆర్థిక పరిస్థితి...." సురేష్ మాటలు ఇంకా పూర్తి కాలేదు.

అంతవరకూ ఓర్పు వహించిన సీతారామయ్యగారి మనసు చితికి పోయింది. గుండెల్లో బాధ గొంతులోకి తన్నుకొచ్చింది.

"ఛీ... ఆ మాట అనేందుకు సిగ్గులేదురా? ప్రేమాభిమానాలను డబ్బుతోనా వెలకట్టేది? తల్లిదండ్రుల అనురాగాన్ని లాభనష్టాలతోనా బేరీజు వేసుకొనేది? ఎందుకురా పుట్టేరు? దేని కోసంరా మీ వెధవ జన్మలు? ఈ లోకంలో ప్రతి వాళ్ళు పిల్లల్ని కని పెంచి పెద్ద చేస్తున్నారు.... ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నారు. ఎందు కోసం.... పుట్టగానే చంపుకోలేరు? ఏ ఆశతో పెంచుతున్నారో నీకు తెలునా? ఆ విషయాన్ని ఒక్కసారైనా ఆలోచించావా? చివరి కాలంలో.... ముసలితనంలో.... కన్న బిడ్డలు తమ బ్రతుకుల్లో ఏ ఆనందాన్ని అందిస్తారనో... ఏ వెలుగును వెలిగిస్తారనో ఆశతో.... ఓ చిన్న ఆశతో తమ కష్టాన్నంతా కన్నబిడ్డల కోసం ధారపోస్తున్నారు. తమ రక్తాన్ని చమటగా మార్చి కన్నబిడ్డల భావి జీవితానికి పన్నీటి జల్లు జల్లుతున్నారు. ప్రతీ క్షణం శ్రమించి వాళ్ళ బాగును కాంక్షిస్తున్నారు. కానీ మీలాంటి మూర్ఖులు రెక్కలొచ్చిన పక్షుల్లా స్వార్థంతో తమ సుఖాన్ని వెదుక్కుంటూ వృద్ధాప్యంలో కన్నవాళ్ళను చేరదీయడమే మహా పాపంగా తలిస్తే ఇక ఈ ప్రేమానురాగాలు ఎందుకురా? ఈ రక్తానుబంధాలు ఎవరి కోసంరా? మీరూ పిల్లల్ని కంటున్నారు. పెంచి పెద్ద చేస్తున్నారు. ఏ ఆశతో? ఒక్కసారి.... ఒకే ఒక్కసారి ప్రశ్నించుకొంటే ఓ జీవిత సత్యం బయటపడదూ? ఈనాడు మీరు కంటికి రెప్పల్లా కాపాడుకొని పెంచుతున్న మీ పిల్లలు రేపు పెరిగి పెద్దవాళ్ళై మిమ్మల్ని ఇలాగే నిరాదరణకు గురి చేస్తే మీ గుండెలు బద్దలు కావూ? మనసులో గాయం రేగదూ?.... ఇంత బుద్ధిహీనులుగా ఎందుకు పుట్టార్రా? చాలు.... మిమ్మల్ని కన్నందుకే సిగ్గుపడుతున్నాం. మీ పంచన చేరి మరింత పాపాన్ని ఒడిగట్టలేం..." అంటూ పక్కనున్న భార్య వైపు తిరిగారు.

అప్పటికే కామాక్షమ్మగారు దుఃఖాన్ని ఆపుకోలేక సన్నగా రోదిస్తున్నారు. ఆమెకు అది ఊహించని పరిణామం. కన్నబిడ్డలు అంత కృత్రిమంగా మాట్లాడుతారని ఏ తల్లి మాత్రం ఊహించగలదు?

సీతారామయ్యగారు ఆమె దగ్గరగా వెళ్ళి ఆమెను పొదివిపట్టుకున్నారు.

"చూసావా కామాక్షీ..... మనం పెంచిన మొక్కలు అమృత ఫలాలు అందిస్తాయని ఆశపడ్డాం.... కానీ ఇప్పుడు చూడెలా విషఫలాలు అందిస్తున్నాయో.... పద కామాక్షీ... పద.... వీళ్ల దగ్గర మనం బ్రతకలేం" అంటూ భార్యను మెల్లగా నడిపించుకుంటూ అక్కడ నుంచి ముందుకు కదిలారు.

ఆ తర్వాత సీతారామయ్యగారు ఏనాడూ కొడుకుల గడప తొక్కలేదు. సొంత ఊరు చేరారు. పుట్టి పెరిగిన ఊరు. తెలిసిన మనుషులు. ఇద్దరూ

ఇటీవల జబల్‌పూర్‌లోని ఆయుధ కర్మాగారం ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమంలో మేజిక్ ప్రదర్శిస్తున్న శ్రీ బి. వి. పట్టాభిరామ్.

ఇ'వేమన' పద్యాలు

ఆకలి



పనితొడువులు వేరు బంగారమొక్కటి
పరగదేహి వేరు ప్రాణమొక్కటి
యరయ తిండి వేరు నాకలి యొక్కటి
విశ్వదాభిరామ వినురవేమ.

విషఫలం

బ్రతకడానికి ఫించను డబ్బులు పనికొచ్చేయి.

భారంగా రోజులు గడుస్తున్నాయి.

కామాక్షమ్మగారు కొడుకుల నిరాదరణ నుండి తేరుకోలేక పోయారు. రోజు రోజుకూ ఆమెలో మనోవేదన అధికమయింది. కన్నకొడుకుల మాటలు పదే పదే గుర్తొచ్చి బోరున ఏడ్చేదామె..

"ఏమండీ.... మనం ఏం పాపం చేసామని భగవంతుడు మనకీ శిక్ష విధించాడండీ? ముసలి కాలంలో కన్నబిడ్డల నీడన బ్రతకాలని వాళ్ళు ప్రయోజకుల్లై పచ్చగా సంసారాలు చేసుకుంటూ తమ కళ్ళ ముందు జీవిస్తుంటే తృప్తిగా చూడాలని తాతయ్య, అమ్మమ్మ అంటూ మనుమలు, మనుమరాళ్ళు పిలుస్తుంటే చెవులారా వినాలని ఏ తల్లితండ్రులు ఆశించరండీ? అలా ఆశించడం మన తప్పంటారా? మీ ఆనందాన్ని అణువంత పంచివ్వండి మీ దుఃఖంలో మమ్మల్నీ పాలుపంచుకోనివ్వండి అంటూ వాళ్ళ గడపలెక్కితే అభిమానానికి డబ్బుకీ లంకె వేసేకుళ్ళు మనస్తత్వాలు వాళ్ళకు ఎలా అబ్బేయండీ?" అంటూ గోడున విలపించేది ఆమె.

"ఊరుకో కామాక్షీ.... ఎందుకు ఏడుస్తావు? కాలం. మారింది మనుషులు మారేరు. వాళ్ళంతా డబ్బు మనుష్యులు... మమతానుబంధాలు వాళ్ళకు తెలియవు. ప్రేమానురాగాలు వాళ్ళ దృష్టిలో నిలవవు. తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవాలనే తపన వారికి లేదు. వాళ్ళంతా మరమనుష్యులు. అలాంటి వాళ్ళ గురించా నువ్వు బాధపడేది?" అంటూ సీతారామయ్య గారు దుఃఖంతో కుమిలిపోతున్న భార్యను ఒడి చేర్చుకొని ఓదార్చేవారు.

ఆయన ఓదార్పులకు ఆ మాతృ హృదయం చల్లబడేది కాదు. ఆమె కొడుకుల సన్నిధిలో చివరి కాలంలో బ్రతకాలని ఎంతగానో ఆశపడింది. కొడుకులు తనను ప్రేమగా చూస్తుంటే ఆ సంతోషంతో తృప్తిగా ప్రాణాలు విడవాలనుకున్నది. కానీ ఆమె ఆశలన్నీ అడియాశలయ్యేయి. ఆ బాధతో... ఆ దుఃఖంతో రోజు రోజుకూ క్షీణించి తీరని మనోవేదనతో చివరకు కన్ను మూసిందామె.

★ ★ ★ ★ ★

కిటికీలోంచి విసురుగా వచ్చిన వర్షపు జల్లు సీతారామయ్యగారి ముఖం మీద పడింది.

ఉలిక్కిపడి గతం నుంచి వాస్తవంలోకి వచ్చేరు ఆయన.

బయట వర్షం.....

జోరున వర్షం....

బోరున ఏడుస్తున్నట్టు......

కూర్చున్న కుర్చీలోంచి మెల్లగా లేచి భారంగా నడుచుకొంటూ వెళ్ళి కిటికీ తలుపులు వేసారాయన....

ఒక్కసారి ఆ గది నిండా భయంకరమయిన నిశ్శబ్దం....

మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుని ఆలోచనల్లో పడ్డారు.

అలా ఆలోచిస్తూ ఆ కుర్చీలో ఎంత సేపు కూర్చున్నారో ఆయనకే తెలీదు!

అర్ధరాత్రి వేళ ఓ నిర్ణయానికి వచ్చి లేచి నిల్చున్నారు!

★ ★ ★ ★ ★

తెల్లవారింది....

వర్షం వెలిసింది....

అగ్రహారం నడిబొడ్డు నున్న ఆ పాత కాలంనాటి పెంకుటింటి చూరుల నుండి వర్షం నీరు కన్నీరులా ఒక్కొక్క బొట్టు నేల రాలుతోంది.

అంతవరకూ ఆ ఇంటి చూరుల్ని పట్టుకుని వేలాడిన చావుకళ విజయగర్వంతో ఆ ఇంటి నాలుగు గోడల మధ్య నృత్యం చేస్తోంది.

ఆ ఇంటి మధ్య గదిలో దూలానికి కట్టిన తాడుకి సీతారామయ్యగారి దేహం నిర్జీవంగా వేలాడుతోంది....